## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెబ్బేరు: వనపర్తి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పెబ్బేరుకు చెందిన బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం మంత్రి నిరంజన్‌రెడ్డి పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన లక్ష్మీదేవమ్మకు రూ.60 వేలు, రాములమ్మ రూ.33,500 చెక్కులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, సాయినాథ్, వెంకయ్య, సంతోష్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్



అమరచింత: ఆత్మకూర్ పట్టణంలోని పెద్ద మసీదులో ఆదివారం ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు నియమ నిష్టలతో ఉపవాస దీక్ష చేపట్టడం ఎంతో దైవకార్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్ తెలిపారు. ముస్లిం మైనార్టీలను అన్ని రంగాల్లో ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. కార్యక్రమంలో నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, ప్రధాన కార్యదర్శి అయ్యుబ్‌ఖాన్, రహమతుల్లా, జబ్బార్, పరమేష్, శ్రీను, బుచ్చన్న పాల్గొన్నారు.

### ఇఫ్తార్‌లో మాజీ మంత్రి చిన్నారెడ్డి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని మసీద్ దగ్గర ఆదివారం రాత్రి ముస్లింలకు కాంగ్రెస్‌పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి హాజరై వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయనను ముస్లిం పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, మాజీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జయకర్, నయీమొద్దీన్, అజీమ్, డా. నరేందర్‌గౌడ్, విజయలక్ష్మి, ప్రభాకర్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, నాగేశ్వర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### మైనార్టీలకు అన్యాయం




గద్వాల అర్బన్: డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుల్లో మైనార్టీలకు అన్యాయం చేశారని ఎంఐఎం మండల అధ్యక్షుడు రఫీ, పట్టణ అధ్యక్షుడు బంగి సుదర్శన్‌లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా నిర్వహించిన డిప్ ప్రక్రియ అనుమానాలకు తావిస్తోందన్నారు. ఒక వార్డులో 100 మందికి పైగా మైనార్టీలు ఉంటే మూడు డబుల్ బెడ్రూం ఎలా వస్తాయని ప్రశ్నించారు. రిజర్వేషన్ పేరుతో కోతలు విధించి నిజమైన అర్హులకు అన్యాయం చేశారన్నారు. పేద ముస్లిం కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయానికి రిఫ్రిజిరేటర్ వితరణ

గద్వాల రూరల్: వేసవికాలం దృష్టిలో ఉంచుకుని వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా అభ్యర్థుల కోసం గ్రంథాలయ జిల్లా చైర్మన్ జంబురామన్‌గౌడ్ రిఫ్రిజిరేటర్‌ను వితరణ చేశారు. ఆదివారం గ్రంథాలయంలో రిఫ్రిజిరేటర్‌ను ఏర్పాటు చేశారు. తాగునీరు అందించేందుకు కృషి చేసిన చైర్మన్‌కు పాఠకులు, అభ్యర్థులు ధన్యావాదాలు తెలిపారు. గతంలో కూడ గ్రంథాలయంలో కుర్చీలు ఇతర ఫర్నీచర్‌ను చైర్మన్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. కార్యకరమంలో కార్యదర్శి శ్యాంసుందర్, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రంజాన్ తోఫా పంపిణీ

శాంతినగర్: పట్టణ, వడ్డేపల్లి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లు అందజేశారు. శాంతినగర్, వడ్డేపల్లిలోని 20 ముస్లిం కుటుంబాలకు సరుకులు, రూ.300 నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ షేక్ అస్లాం షరీఫ్, దాసువరం నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, మాలిక్, ఖలీల్ పాల్గొన్నారు.



# భానుడి భగభగలు

- రోజురోజు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఏప్రిల్ ప్రారంభం నుంచే అధికంగా నమోదు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు

**జిల్లాలో ఆయా ప్రాంతాల వారీగా ఉష్ణోగ్రత నమోదు**

| తేదీ | మండలం | నమోదైన ఉష్ణోగ్రత |
|---|---|---|
| 8 | మదనాపురం | 40 డిగ్రీలు |
| 9 | మదనాపురం | 40 |
| 10 | పెబ్బేరు | 40.1 |
| 11 | పాన్‌గల్ | 41.9 |
| 12 | కొత్తకోట | 42.8 |
| 13 | పాన్‌గల్ | 41.8 |
| 14 | పానగల్ | 42.6 |
| 15 | చిన్నంబావి | 40.8 |



పాన్‌గల్ మండల కేంద్రంలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

మదనాపురం: ఏప్రిల్ నెలలోనే భానుడి ప్రతాపంతో జనాలు అల్లాడుతున్నారు. ఉదయం 7 గంటలకే ఎండలు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు తీవ్రంగా ఉంటున్నాయి. వారం రోజులుగా జిల్లాలో 40 డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మరో మూడు రోజులపాటు ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతల పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు చేశారు. ఎండలు దంచి కొట్టడంతో మే మాసంలో ఎలా ఉంటాయో ఆలోచిస్తే ముచ్చటలు పడుతున్నాయి. ప్రధానంగా 36 డిగ్రీల లోపు ఎలాంటి హెచ్చరికలు ఉండవు. 35 డిగ్రీల నుంచి జాగ్రత్తగా ఉండాలని అధికారులు చెబుతారు. 41 డిగ్రీల నుంచి పైగా నమోదు అయితే అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

**నిర్మానుష్యంగా రోడ్లు**

జిల్లాలోని పట్టణ ప్రాంతాలతో పాటు మండల కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఎండ తీవ్రతకు జనం బయటికి రావాలంటే జంకుతున్నారు. దీంతో ఎటు చూద్దామన్న రోడ్లపై ఒక్కరూ కనిపించడం లేదు. గతంలో కరోనా సమయంలో కనిపిస్తున్న రోడ్లు మళ్లీ దర్శనమిస్తున్నాయి. పాన్‌గల్, ఖిల్లాఘనపురం, మదనాపురం, అమరచింత, కొత్తకోట, వనపర్తి తదితర ప్రాంతాల్లో జనం బయటకు రావడం లేదు. ఒకవేళ అత్యవసర పనులపై వస్తే తలపై ముసుగులేసుకుని మాస్కులు ధరించి వెళ్తున్నారు. ద్విచక్ర వాహనదారులైతే కచ్చితంగా హెల్మెట్ ధరిస్తున్నారు.



మదనాపురంలో కొంగు కప్పుకొని వెళ్తున్న మహిళలు

**చెట్ల కిందికి పరుగులు**

ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరికి తట్టుకోలేక బయటకు వద్దామంటే ఎండ, ఇంట్లో ఉందామంటే ఉక్కపోతతో జనాలు అవస్థలు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు అధిక స్థాయికి చేరుకోవడంతో ఫ్యాన్లు, కూలర్లు కూడా సరిపోవడం లేదు. కొంతమంది తమ ఇళ్ల ముందు పెంచుకున్న వేప, కానుగ చెట్ల కిందకు వెళ్లి సేద తీరుతున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు చెరుకు రసం, లస్సీ, జ్యూస్ లాంటివి సేవిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా శీతల పానియాల దుకాణాలు వెలిశాయి.

**నీరు ఎక్కువ తాగాలి**



వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువగా తాగాలి. జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. పిల్లలు, వృద్ధులు బయటికి రాకుండా జాగ్రత్త పడాలి. ఉదయం 10 గంటల్లోపు అన్ని పనులు ముగించుకుని ఇంట్లోనే ఉండాలి. సాయంత్రం 5గంటల తర్వాత బయటికి రావచ్చు. ఒకవేళ అత్యవసర సమయాల్లో వస్తే కచ్చితంగా తలపై గుడ్డ లేదా గొడుగు, టోపీ ధరించాలి. ఎండ నుంచి ఉపశమనం కోసం నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయలు, కీరా, మజ్జిగ తీసుకోవడం మంచిది.

–రవిశంకర్, జిల్లా వైద్యాధికారి, వనపర్తి

# ప్రారంభమైన వరికోతలు



ఖిల్లాఘనపురంలో వరికోతలు

ఖిల్లాఘనపురం: మండలంలో యాసంగి పంటగా సాగు చేసిన వరికి రైతులు కోతలు మొదలుపెట్టారు. ఈ సంవత్సరం ఆది నుంచి వరికి తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎలాగోలా పంటలు కోత దశకు వచ్చాయనుకుంటున్న సమయంలో మూడు రోజులుగా వాతావరణం చల్లబడటం రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. మరో 20 రోజుల పాటు వర్షం కురువకుండా ఉంటే 90శాతం కోత పూర్తవుతుందని రైతులు తెలిపారు.

**11,620 ఎకరాల్లో వరి సాగు**

మండలంలో ఈ సంవత్సరం యాసంగి 11,620 ఎకరాల్లో రైతులు 1010, ఆర్ఎన్ఆర్ తదితర రకాల వరి పంటలను సాగు చేసుకున్నారు. ముందు సాగు చేసిన రైతులు గ్రామాల్లో కోతలు మొదలు పెట్టారు. మండలంలో కేఎల్ఐ సాగునీరు పారుతుండటంతో పాటు ప్రభుత్వం అన్ని చెరువులను నీటితో నింపుతుండటంతో మెట్ట పొలాలను కూడా చదును చేసుకుని వరి వేసుకున్నారు.

**కవర్లు సిద్ధంగా ఉంచుకోవాలి**



మండలంలో వారం రోజుల నుంచి రైతులు వరి కోతలు ప్రారంభించారు. వాతావరణం పొడిగా ఉన్నందున వర్షం వస్తే కప్పేందుకు ముందుగానే అవసరమైన కవర్లను సిద్ధం చేసుకోవాలి. పంటను ఈ సమయంలో జాగ్రత్తగా చూసుకోవడం వలన మంచి ధర వస్తుంది. ఉదయం ఆరబెట్టి రాత్రివేళ లో ధాన్యాన్ని కచ్చితంగా కవరు కప్పి ఉంచాలి.

–మల్లయ్య, ఏఓ, ఖిల్లాఘనపురం

# ప్రతి ఒక్కరికీ న్యాయ సలహాలు



మాట్లాడుతున్న న్యాయవాది పంకజ్‌రెడ్డి

అమరచింత: శ్రీసత్యసాయి న్యాయ సలహా కేంద్రం ద్వారా ప్రతి ఒక్కరికి ఉచితంగా న్యాయ సలహాలు అందించడానికి శ్రీకారం చుట్టామని స్టేట్ ఆర్గనైజింగ్ హైకోర్టు న్యాయవాది పంకజ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూర్ పట్టణంలో ఆదివారం శ్రీసత్యసాయి మందిరంలో ఉచిత న్యాయ సలహా కేంద్రం ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ప్రస్తుతం నిత్యం పలు సమస్యలతో, ఆర్థిక మోసాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురౌతున్నారని వెల్లడించారు. న్యాయం ప్రతి ఒక్కరి హక్కు అనే విషయాన్ని చాటి చెప్పేందుకే ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం న్యాయ సలహా కేంద్రంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారికి సత్వర న్యాయ సలహాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పుష్పవర్ధన్, పుల్లయ్యశెట్టి, శ్యాంలాల్, తిప్పారెడ్డి, నారాయన్‌గౌడ్, రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయించడాన్ని హర్షిస్తూ ఆదివారం గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, సింగిరెడ్డి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి శుభకార్యాలు నిర్వహించాలన్నా సరైన వేదికలు లేక జిల్లా కేంద్రం, బీచుపల్లి దేవాలయాలకు వెళ్లాల్సి వస్తుండేదన్నారు. ఎమ్మెల్యే కృషితో గ్రామ ఆలయంలో మండపం నిర్మాణంకు నిధులు మంజూరు చేయించడం హర్షించదగిన విషయం అన్నారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడు, జనార్దన్ రెడ్డి, కోటయ్య, బుచ్చన్న, బాలస్వామి, రమేష్‌బాబు, సత్యారెడ్డి, పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

- పంచాయతీరాజ్ శాఖ డీఈ ప్రమోద్



ఖిల్లాఘనపురం: బీటీ రహదారుల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్‌శాఖ డీఈ ప్రమోద్ అన్నారు. ఆదివారం మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి సల్కెలాపురం వరకు 1.6 కిలోమీటర్ల రోడ్డుకు బీటీ పనులను సర్పంచ్ కృష్ణవేణి, ఉపసర్పంచ్ చంద్రకళతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అధ్వాన రహదారుల మరమ్మతుకు నిధులు మంజూరు చేస్తోందన్నారు. అప్పారెడ్డిపల్లి రోడ్డు గతంలో జన్మభూమి పథకంలో 30 శాతం గ్రామస్తులు, 70 శాతం ప్రభుత్వ నిధులతో చేపట్టారని.. అధ్వానంగా మారి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతుకు రూ.88.38 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. ఇప్పటికే ఒక లేయర్ మెటల్ మిక్స్ వేశామని.. సోమవారం బీటీ పూర్తిచేసి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాసులు, శంకర్‌గౌడ్, కృష్ణయ్య, శేషయ్య, మాదవ్, చెన్నయ్య, ఆంజనేయులు, విష్ణు పాల్గొన్నారు.

# జ్ఞానంతోనే అసమానతలు దూరం



అజ్జకొల్లులో ప్రచారంలో పాల్గొన్న సభ్యులు

మదనాపురం: త్రైత సిద్ధాంత భగవద్గీత చదివితే జ్ఞానం వస్తుందని, దీని ద్వారా సమాజంలో ఉన్న అన్ని రకాల అసమానతలు పోతాయని ప్రబోధ సేవ సమితి కొత్తకోట అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఆదివారం అజ్జకొల్లులో త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజలలో దైవ భక్తిని పెంపొందించడానికి దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం, శేఖరరెడ్డి, జాంగీర్, కృష్ణయ్య, మాసన్న, హరీష్, శివ శంకరమ్మ, లయ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



ఆత్మకూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అమరచింత: వేసవికాలంలో అగ్నిప్రమాదాలు అధికంగా చోటు చేసుకునే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూర్ ఫైర్ అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. ఆత్మకూర్ పట్టణంలోని వర్తక సముదాయాలు, ప్రైవేట్ ఆస్పత్రులలో అగ్ని ప్రమాదాల నివారణపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీ వాసన వస్తున్నప్పుడు ఎలా వ్యవహరించాలి, ప్రమాదం నుంచి తమను తాము ఎలా కాపాడుకోవాలనే విషయాలపై ప్రయోగాత్మకంగా ప్రజలకు వివరించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను వివరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది నరేష్ గౌడ్, సందీప్‌రెడ్డి, నరసింహరెడ్డి, వెంకట్ నరసింహ, బానుచందర్, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బునాదిపూర్ బాధితులకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

పెబ్బేరు: మండలంలోని బునాదిపూర్ శివారులోని సర్వేనంబర్ 117 సర్వే చేసి బాధితులకు న్యాయం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కబ్జాకు గురైన భూమిని పరిశీలించి మాట్లాడారు. పట్టణానికి ఆనుకొని బత్తుల చిన్నయ్య భూమి పక్కన 111 సర్వే నంబర్ ఆనుకొని ఉండడంతో గతంలో కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణానికి అనుమతులు తీసుకొని 117 సర్వే నంబర్‌లో నిర్మాణం చేపట్టడంపై 2022లో అక్రమ నిర్మాణాలపై ప్రశ్నించిన కుటుంబ సభ్యులపై, 9వ తరగతి విద్యార్థిపై పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపించారన్నారు. అలాగే 447 సర్వే నంబరులో జడ్చర్ల మహేష్‌శెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారికి భూమి ఉందని కొన్ని సంవత్సరాలుగా సరిహద్దులపై పంచాయితీ ఉండడంతో జిల్లా సర్వేకు పెట్టుకున్నట్లు తెలిపారు. బాధితులు మూడేళ్ల క్రితం ఇచ్చిన ఫిర్యాదు అధికారులు స్పందించి వెంటనే సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతున్నారన్నారు. ఆయన వెంట సత్తార్, విష్ణు, గోవిందు, బీసన్న, కురుమన్న, పెద్ద రాములు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

# మోసపూరిత హామీలు నమ్మొద్దు



గోపల్‌దిన్నెలో కూలీలతో ముచ్చటిస్తున్న సంపత్

ఎర్రవల్లిచౌరస్తా: సీఎం కేసీఆర్ దళితులకు మోసపూరితమైన హామీలు ఇచ్చి పబ్బం గడుపుతున్నారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ బీఆర్ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఆదివారం ఇటిక్యాల మండలంలోని మొగిలి రావులచెర్వు, గోపల్‌దిన్నె గ్రామాలలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో మమేకమై చేయి చేయి కలుపుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ యాత్రను కొనసాగించారు. గోపల్‌దిన్నె గ్రామ సమీపంలో పొలం పనులు చేస్తున్న కూలీలతో ముచ్చడించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ హామీలే ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ, సిలిండర్ ధర రూ. 500కి తగ్గించి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటును కల్పిస్తామన్నారు. ఆయన వెంట రవి, వెంకటేష్, మద్దిలేటి, వెంకటన్న, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు, ఉన్నారు.

# పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు



అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీలకు మూడు రోజుల నుంచి తాగునీరు సరఫరా చేయలేదు. దీంతో పట్టణ ప్రజలు ఆదివారం తాగునీటి కోసం పడరాని పాట్లు పడ్డారు. వాటర్ ఫిల్టర్ చేసే ప్రదేశంలో మట్టిని తొలగించడానికి తాగునీటి సరఫరాను రెండు రోజులపాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే మూడో రోజు కూడా మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరా చేయకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో 10 వార్డు కౌన్సిలర్ మేకల అనిత సొంత ఖర్చులతో వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న కొన్ని కాలనీల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను చేయించారు.

# విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

అయిజ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలో యోబు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి 'మహిళా ఇన్విటేషన్ కబడ్డీ టోర్నమెంట్' శనివారం రాత్రి ముగిసింది. ప్రథమ బహుమతి హరియాన జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 50,016లు కైవసం చేసుకుంది. ద్వితీయ బహుమతి కర్నూలు జట్టు రూ. 30,016లు, తృతీయ బహుమతి వైజాక్ జట్టు రూ. 20,016లు, నాల్గో బహుమతి శ్రీకాకుళం జట్టు రూ. 15,016లు, ఐదో బహుమతి మైసూరు జట్టు రూ. 10,016లు గెలుచుకున్నాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యోబు, నాయకులు ఆర్. శ్రీధర్, రామదాసు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు పొందిన విద్యార్థులతో మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మోనప్పగుట్ట మోనేశ్వరస్వామి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జీకే మాస్టర్ షోటోకాన్ కరాటేడూ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. బెల్టు గ్రేడింగ్ పరీక్షలో దాదాపు 55మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా వివిధ బెల్టులు అందజేశారు. అనంతరం జీకే మాస్టర్ షోటోకాన్ బ్లాక్‌బెల్టు ఫెడరేషన్ జిల్లా, పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శివకుమార్, సలహాదారుడిగా నాగరాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బాలును ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా జి.రాజు, సలహాదారుడు బాల్‌రాజు, ఉపాధ్యక్షులుగా పి.సత్యనారాయణ, నవీన్‌కుమార్, ఎం.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీధర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా జి.శ్రీనివాసులు, అఖిలేశ్వర్‌రెడ్డి, జి.ప్రసాద్, కోశాధికారిగా ఈ.వెంకటస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎం.మారుతి, నరేందర్, ఈ.అనిత, బి.రవిలను ఎన్నుకున్నారు.

**విద్యార్థులను అభినందించిన మంత్రి..**

బెల్టు గ్రేడింగ్ పరీక్షలు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సర్టిఫికెట్లు అందజేశారు. కరాటే పంచెస్‌లు చేయించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యార్థులు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు కరాటే మార్షల్ ఆర్ట్స్, ఇతర క్రీడల్లో శిక్షణ తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా, పట్టణ కమిటీ సభ్యులను మంత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్ జి.కృష్ణయ్య, ఎగ్జామినర్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఇలియాజ్ బిన్ సిద్ధిఖీ, శివకుమార్, నాగరాజుగౌడ్, శ్రీధర్,రాజు, వెంకటస్వామి, రాజేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

అడ్డాకుల: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతాయని ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. మూసాపేట మండలం వేములలో బీఆర్ఎస్ నాయకుడు రవీందర్‌గౌడ్ రెండు రోజుల పాటు నిర్వహించిన వేముల సమ్మర్ ప్రీమియం లీగ్ ఆదివారం ముగిసింది. స్థానిక గ్రామానికి చెందిన యువకులు 9జట్లుగా ఏర్పడి పోటీల్లో పాల్గొనగా, గెలుపొందిన జట్లకు ఎస్ఐ విజయభాస్కర్ బహుమతులను అందజేశారు. బోయ బుచ్చన్న అండ్‌టీం జట్టుకు మొదటి బహుమతితో పాటు రూ.12వేలు, కార్తీక్ అండ్ టీంకు రెండో బహుమతితో పాటు రూ.6వేలను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

### టీజీసీజీటీఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం టీజీసీజీటీఏ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.తిరుపతయ్య, కార్యదర్శిగా డా.జి.రాజేందర్, కోశాధికారిగా వి.పుష్పలత, ఉపాధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రామరాజయాదవ్ వ్యవహరించారు. అనంతరం వీరిని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాఘవేంద్రరెడ్డి, శివలీల, సత్యనారాయణగౌడ్, నరసింహారావు అభినందించారు.